
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 34.0
కనిష్ఠం 24.5

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 4 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.00 (300.3200)	63,580	47,552
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.70 (3.86)	281.71	666.13
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.570 (42.0787)	20,116	19,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

కురిసిన వాన



జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో కురుస్తున్న వాన

జిల్లాకేంద్రంలో ఆదివారం వర్షం కురిసింది. రాత్రి 8 గంటలకు మొదలైన వాన 11 గంటల వరకు వాన పడింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు చల్లదనంతో కాస్త ఉపశమనం పొందారు. వీధులన్నీ జలమయం కాగా, మురుగు కాల్వలు పొంగిపొర్లాయి.

తగ్గిన వరద.. గేట్ల మూసివేత



సాగర్‌లో ట్రాఫిక్ జాం, (ఇన్‌సెట్‌లో) మూసివేసిన గేట్లు

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక తగ్గింది. దీంతో ఆదివారం ఉదయం 11 గంటలకు సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మూసివేశారు. సాగర్ గేట్లు ఎత్తి గత ఆరు రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకులు సాగర్ అందాలను తిలకించేందుకు వచ్చారు. ఎంతో ఆశతో వచ్చిన పర్యాటకులకు గేట్లు మూసివేయడంతో నిరాశే మిగిలింది. అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో సాగర్ పైలాన్ కాలనీ కొత్త వంతెన నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం వెళ్లే రహదారిలో, అలాగే బైపాస్ రోడ్డులో మూడు కిలో మీటర్ల మేరకు రెండు గంటల పాటు భారీగా ట్రాఫిక్ నిలిచింది.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

7

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

నల్లగొండరూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆశాలకు రూ.1500 పారితోషికం పెంచుతున్నట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించి, కనీస వేతనం అమలు చేసే వరకు పోరాటాలు ఆగవని ఆయన హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు ఆశాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, యూనియన్ జిల్లా కార్యదర్శి తవిటి వెంకటమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు రమావత్ కవిత, జిల్లా నాయకులు బి.అనూష, సుజాత, సునీత పాల్గొన్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- మోస్తరుతోనే సరి, భారీగా కురవని వర్షాలు
- నిండని చెరువులు, కుంటలు
- వట్టిపోతున్న బోరుబావులు



జిల్లాలో మోస్తరు వర్షాలు మాత్రమే కురిశాయి. కనీసం మెట్ట పంటలకు కూడా పూర్తి స్థాయిలో కలిసిరాని పరిస్థితి. భారీగా వర్షాలు కురవకపోవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా భూగర్భజలాలు గణనీయంగా అడుగంటుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి నీటిమట్టం కాస్త పైకి ఉన్నప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

గతేడాది జూలై 31 నాటికి 9.54మీటర్ల లోతులో భూగర్భజలాల నీటిమట్టం ఉండగా, ఈసారి 8.85మీటర్ల లోతులో నీటిమట్టం ఉంది. గతేడాదితో పోలిస్తే ఈసారి కాస్త నీటిమట్టం పైనే ఉందని చెప్పవచ్చు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా, సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అత్యధిక శాతం రైతులు బోరుబావులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మెట్ట ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు పోయడంలేదు. చాలా ప్రాంతాల్లో రైతులు నారుమడులు సిద్ధం చేసుకున్నా, పొలాలు తడవక పోవడంతో సరైన సమయంలో నాటు వేయని పరిస్థితి నెలకొంది. చెరువులు, కుంటల్లో నీరు ఇంకిపోవడంతో బోర్లు కూడా ఆగి పోస్తున్నాయి. జిల్లాలో రోజురోజుకూ భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. చాలాచోట్ల బోర్లు వేసినా, నీరుపడక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పంటలు ఎండిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంవైపు ఎదురు చూస్తున్నారు.

జూలై 31 నాటికి 8.85మీటర్ల లోతులో భూగర్భజలాలు

అధికారుల లెక్కల ప్రకారం జూలై 31నాటికి 8.85 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. వర్షాలు లేక పోవడమే ఈ పరిస్థితికి కారణమని పేర్కొంటున్నారు. గత ఏడాది జూలై 31 నాటికి 9.54మీటర్ల లోతులో నీరు ఉండగా ఈసారి కాస్తా పైకి నీరు ఉన్నాయని చెప్పవచ్చు. అంటే గత ఏడాదితో పోలిస్తే 0.69 మి.మీల తేడాతో నీటిమట్టాలు ఉన్నాయి. ప్రస్తుతం 8.85 మీటర్ల లోతులో నీరు ఉండటంతో బోరుబావులపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. మండలాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా దామచర్లలో 14.18మీటర్లు, కట్టంగూరు 11.17 మీటర్లు, మర్రిగూడలో 13.40 మీటర్లు, మునుగోడు 11.37 మీటర్లు, నిడమనూరు 10.56మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. ఈ సంవత్సరం జూలైలో 187.2మి.మీల వర్షపాతం నమోదకుగాను 184.5 మి.మీలు కురిసింది. అయితే ఇది మెట్ట పంటలకు మాత్రం కొంతమేరకు ఉపయోగపడినప్పటికీ పూర్తిస్థాయిలో మెట్టపంటలకు ప్రయోజనం లేదు. ఇకపోతే భారీ వర్షాలు నమోదు కాకపోవడంతో చెరువు లు, కుంటలు వెలవెలబోతున్నాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల కావడంతో ఏఎమార్పీనుంచి అధికారులు నీటి విడుదల చేయడంతో సుమారు 90 చెరువులకు నీటిని విడుదల చేశారు. అయితే వర్షాలపైనే ఆధారపడి ఉన్న ప్రాంతాల్లో మాత్రం చెరువులు, కుంటలోకి నీరు రాలేదు. దీంతో రాబోయే రోజుల్లో చెరువుల కింద ఉన్న ప్రాంతాల్లో -

మిగతా 8వ పేజీలో...

గతేడాదితో పోలిస్తే..

గత సంవత్సరం జూలైతో పోలిస్తే ఈ సంవత్సరం జూలైలో నీటిమట్టం పైభాగానే ఉంది. గత సంవత్సరం 9.54 మీటర్ల లోతులో ఉండగా ఈ సంవత్సరం 8.85 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. అయినా నీటిమట్టాలు లోతులో ఉండటంతో భూగర్భజలాలు అడుగంటాయి. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో నీటి మట్టాలు పడిపోయాయి. వర్షభావ పరిస్థితుల కారణంగా చెరువులోకి నీరు రాలేదు.

- రేవతి,భూగర్భ జలవనరుల శాఖ డీడీ,నల్లగొండ

బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకుంటే సహించం

- కేంద్ర మంత్రులవి అర్థంలేని మాటలు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

నల్లగొండటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీసీ రిజర్వేషన్ల విషయం లో ఇష్టానురీతిగా మాట్లాడుతున్నారని విమ ర్శించారు. బీసీ జాబితాలో ముస్లింలను కలిపారన్న వంకతో రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేంద్ర మంత్రుల వైఖరి మార్చుకోకుంటే వారి పర్యటనలు అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. రిజర్వేషన్ల విషయంలో చర్చించేందుకు ఎల్‌బీ స్టేడియం లేదా సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో వచ్చేందుకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. అవసరమైతే బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోకి వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కాసోజు విశ్వనాథం, నేలపట్ల సత్యనారాయణ, వాడపల్లి సాయిబాబా, చోల్లేటి రమేష్, గోపాలకృష్ణ, ఆది నారాయణ, కేశబోయిన శంకర్, నల్లా మధుయాదవ్, లాలయ్య, కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

ఆదాయం పెంచడమే లక్ష్యం

- నేటి నుంచి ఇంటింటికీ వార్డు ఆఫీసర్లు



నల్లగొండ మునిసిపాలిటీలో రెవెన్యూ పెంచడమే లక్ష్యంగా యంత్రాంగం తగు ప్రణాళికలు రూపొందించింది. ఈ మధ్యకాలంలో అనధికారికంగా నిర్మించిన భవనాలను గుర్తించి వెంటనే అసీస్‌మెంట్ చేసేందుకు సమాయత్తమయ్యారు. ఈ మేరకు నేటి నుంచి ఈ నెలాఖరు వరకు వార్డు ఆఫీసర్లు ప్రతీ ఇంటికి తిరిగి ఆయా ఇంటి వివరాలను సేకరించనున్నారు. ఇంట్లో అనధికారిక నల్లా కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్స్‌లను గుర్తించి వెంటనే ఆన్‌లైన్ చేయించి మునిసిపల్ ఆదాయం పెరిగేలా చేయనున్నారు.


- (ఆంధ్రజ్యోతి,రామగిరి)

నల్లగొండ పట్టణంలో 48 వార్డులకు గాను 42 మంది వార్డు ఆఫీసర్లు ఉన్నారు. వీరు సోమవారం నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు ప్రతీ ఇంటికి వెళ్లి ఆయా గృహాల వివరాలను సేకరించనున్నారు. దీంతో పాటు ఆయా వార్డుల్లో సమస్యలను కూడా గుర్తించనున్నారు. అంతేకాక ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కూడా సంబంధిత శాఖకు తెలియజేసి వాటిని పరిష్కరించేందుకు యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది.

రూ.5 కోట్లు ఆదాయం పెరిగేలా...

నల్లగొండ పట్టణంలో 48వార్డుల్లో అధికారికంగా 43 వేల పై చిలుకు గృహ నిర్మాణాలు ఉన్నాయి. వీటి నుంచి సుమారు రూ.40 కోట్ల పై చిలుకు ఆదాయం వస్తుంది. అయితే పట్టణంలో రెండేసి భవనాలు ఉండి, ఒకే భవనానికి అసీస్‌మెంట్ కావడం, కూలిపోయిన ఇళ్లకు కూడా డిమాండ్ రావడం వంటి సమస్యల కారణంగా ఆదాయం అనుకున్నంత రావడం లేదు. దీంతో ఏటా ఆదాయ డిమాండ్‌లో ఉన్న లక్ష్యం నెరవేరడం లేదు. ఇలాంటి సమస్యలను గుర్తించేందుకే వార్డు ఆఫీసర్లను ఇంటింటికి తిప్పనున్నారు. అనధికారికంగా నిర్మాణమైన ఇళ్ల నుంచి రూ.5కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వార్డు ఆఫీసర్లకు సహకరించాలి




నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు వార్డు ఆఫీసర్లు ప్రతీ ఇంటికి రానున్నారు. వార్డు, ఇంట్లో ఏ సమస్య ఉన్నా ఈ వార్డు ఆఫీసర్‌కు తెలియజేయాలి. ఇంటికి వచ్చే వార్డు ఆఫీసర్ అడిగే ప్రశ్నలకు యజమానులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు చూపించి సహకరించాలి.

- శివరాంరెడ్డి, రెవెన్యూ అధికారి

సిద్ధమైన మంత్రి క్యాంపు కార్యాలయం

నేడు ప్రారంభించనున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయం సిద్ధమైంది. సోమవారం ఉదయం 9.15 గంటలకు నూతనంగా నిర్మించిన మంత్రి క్యాంపు కార్యాలయాన్ని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఉదయం క్యాంపు కార్యాలయంలో నిర్వహించే పూజా కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. అన్ని హంగులతో మంత్రి క్యాంపు కార్యాలయాన్ని తీర్చిదిద్దారు. క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి ముందే ఉదయం 8.15 గంటలకు రూ.200కోట్ల అంచనాతో నిర్మించే యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి సంబంధించి మంత్రి భూమి పూజ చేయనున్నారు.



విద్యుత్ కాంతులతో ముస్తాబైన మంత్రి క్యాంపు కార్యాలయం

బీమా లేని వారికి 'జనసురక్ష'

- ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్‌బీఐ ఎండీ అమర రామ్మోహన్‌రావు

చిట్యాలరూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీమా భద్రత లేని వారికి జనసురక్ష పథకం ద్వారా రక్షణ కల్పించడమే ఎస్‌బీఐ ధ్యేయమని ఎస్‌బీఐ ఎండీ అమర రామ్మోహన్‌రావు అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌సురక్ష పథకం గురించి ఖాతాదారులు, మహిళాసంఘం సభ్యులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. గ్రా మీణ ప్రాంతాల ప్రజలకు జనసురక్ష పథకం ఎంతో అవసరమని, బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ జనసురక్ష పథకంలో చేరాలని సూచించారు. ఖాతాదారుల భద్రత, రక్షణ ఎంతో ముఖ్యమని కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, జీవన్‌జ్యోతి బీమాయోజన, సురక్ష బీమా, అటల్ పెన్షన్‌తో పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ వారి ఖాతాను కేవైసీ చేయించుకోవాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ మోసాలు పెరిగాయని, ఎవరైనా మోసపోతే 1930 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో అనేక ఖాతాలు యాక్టివ్‌గా లేవని వాటిని యాక్టివ్‌లో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీజీఎం సహదేవన్ రాధాకృష్ణన్, జీఎంలు రవికుమార్‌వర్మ, సతీష్‌కుమార్, డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి, డీజీఎం బినోద్‌కుమార్ సిన్హా, నల్లగొండ ఆర్‌ఎం కె.శివకృష్ణబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, చిట్యాల శాఖ మేనేజర్ బొజ్జగాని సతీష్, సిబ్బంది ఆకాష్, రాజశేఖర్, ప్రవీణ్ పాల్గొన్నారు.



పెద్దకాపర్తిలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ ఎండీ అమర రామ్మోహన్‌రావు

ఎల్లమ్మ ఆలయానికి 'శ్రావణ' రద్దీ



కనగల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి శ్రావణమాసం నేపథ్యంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు, మొక్కుబడి కల్యాణాలు జరిపించి చీర సారెలను బోనప్రైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉంటే ఆలయ ముఖ్య అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణలు చేసి అష్టోత్తర పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

శుభకార్యానికి వచ్చి మృత్యుఒడికి

● భువనగిరిలో లారీ బీభత్సం అదుపుతప్పి దూసుకెళ్లిన వైనం ● ఇద్దరు మృతి, ధ్వంసమైన వాహనాలు




దూసుకెళ్లిన లారీ, ధ్వంసమైన బైక్

భువనగిరి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఆదివారం మధ్యాహ్నం ఓ లారీ బీభత్సం సృష్టించింది. స్థానిక జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద అదుపుతప్పిన లారీ పాదచారులు, నిలిపి ఉన్న వాహనాలు, మూసి ఉన్న దుకాణాల పైకి దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందగా, ఐదుగురు గాయాలపాలయ్యారు. రోడ్డు పక్కన నిలిపి ఉన్న వాహనాలు, దుకాణాలు ధ్వంసమయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ వైపు నుంచి వస్తున్న లారీ అదే చౌరస్తాలో హైదరాబాద్ వైపు తిరుగుతున్న క్రమంలో అదుపుతప్పి దూసుకెళ్లింది. దుకాణం సమీపంలో నిల్చున్న జహీరాబాద్ జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ సంస్థ మేనేజర్ చిలమామిడి రామకృష్ణ(35), అతని సోదరుడి కుమారుడు, కారు డ్రైవర్ చిలమామిడి సాయికుమార్ (27)లు లారీ, డబ్బా దుకాణాల మధ్య ఇరుక్కొని కొద్దిసేపు విలవిల్లాడారు. రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా, సాయి కుమార్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందారు. వీరు జీవనోపాధి కోసం కుటుంబాలతో మేడ్చల్ జిల్లా సూరారంలో నివాసం ఉంటున్నారు. ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు భువనగిరి వచ్చిన దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో రామన్నపేట మండల ఇంద్రపాలనగరానికి చెందిన బిమారి సాయికుమార్ ఎడమకాలు విరగ్గా, ఇద్దరు పాదచారులతో పాటు లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. మూడు ద్విచక్ర వాహనాలు, రెండు దుకాణాలు పాన్ షాప్, టీ స్టాల్ ధ్వంసమయ్యాయి. ఆ దుకాణాలు కూడా మూసి ఉండటం, వినియోగదారులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బాధితుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ ఇన్స్ పెక్టర్ రమేష్ కేసునమోదు చేయగా ఎస్ఐ లక్ష్మీనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

భీతిల్లిన చూపరులు..

కళ్లెదుటే జరిగిన ఘోర ప్రమాదంతో చూపరులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. క్షణాల వ్యవధిలో అదుపుతప్పిన లారీ దూసుకురావడం, రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న పాదచారులు మృతి చెందడం, వాహనాలు, దుకాణాలు ధ్వంసం కావడంతో స్థానికులు హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్ పడేలోపు దాటే ప్రయత్నంలో డ్రైవర్ లారీని వేగంగా నడపడంతో అదుపుతప్పి ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొంటున్నారు. లారీకి, గోడకు మధ్య ఇరుక్కున్న మృతదేహాన్ని అరగంటకు పైగా సమయం పట్టింది.

శుభకార్యానికి వచ్చి... మృత్యుఒడికి చేరి

వరుసకు తండ్రీకుమారులైన ఇద్దరూ శుభకార్యానికి వచ్చి మృతి చెందడంతో శుభకార్యం జరగాల్సిన భువనగిరి ఇంటిలో, మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. శుభకార్యానికి అవసరమైన సామాగ్రి తీసుకునేందుకు వచ్చి మిఠాయి దుకాణం సమీపంలో నిల్చున్న వీరిద్దరిపై దూసుకురాగా, కొంతమంది తప్పించుకున్నారు. ఈ ఘటనలో వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతోనైనా చౌరస్తాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాల వేగ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



రోదిస్తున్న మృతుల బంధువులు

రోడ్డు వెంట ఆక్రమణలు తొలగించాలి : ఎమ్మెల్యే కుంభం

భువనగిరి పట్టణ రహదారుల వెంట ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పోలీసులను, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. లారీ బీభత్సం సృష్టించిన జగదేవ్‌పూర్ చౌరస్తాను ఆయన పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. రహదారుల వెంట దుకాణాల ప్రకటనల బోర్డులను తొలగించాలని, చౌరస్తాల్లో పాదచారులు ఎవరూ గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వందఫీట్ల పట్టణ ప్రధాన రహదారి నిర్వహణలోపం కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారిని విస్తరించినప్పటికీ జాగ్రత్త చర్యలను అధికారులు విస్మరించారన్నారు. జీబ్రాలైన్స్ తదితర ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

దాచారం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మోత్కూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని దాచారం పంచాయతీ కార్యదర్శి యాదగిరిని శనివారం కలెక్టర్ హనుమంతరావు సస్పెండ్ చేశారు. ఎంపీవో పైళ్ల జనార్దన్‌రెడ్డికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. విధులకు హాజరైన సందర్భంగా డీఎస్ఆర్ యాప్‌లో సెల్ఫీ తీసి అప్‌లోడ్ చేసి హాజరు నమోదు చేసుకోవాల్సి ఉండగా, దాచారం కార్యదర్శి యాదగిరి గతంలో తీసిన పాత ఫొటోలు అప్‌లోడ్ చేసి హాజరు నమోదు చేసుకున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. దీంతో కలెక్టర్ హనుమంతరావు ఆయనను సస్పెండ్ చేశారు. ఎంపీవో జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంలో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ఇద్దరు కానిస్టేబుళ్లు..

పెన్‌పహాడ్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సివిల్ వ్యవహారంలో జోక్యం చేసుకున్న 12వ బెటాలియన్ నల్లగొండ(అన్నెపర్తి) కానిస్టేబుళ్లు శానం నాగేంద్రబాబు, శానం లక్ష్మణరావులను ఎస్పీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు డీఎస్పీ పి. ప్రసన్నకుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జూలై 12వ తేదీన మండల పరిధిలోని లింగాల గ్రామంలో వ్యవసాయ భూమి వివాదంలో జోక్యం చేసుకొని భరత్ అనే వ్యక్తిని గాయపరిచినందున బాధితుడి తల్లి కళమ్మ ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అనంతరం కానిస్టేబుళ్లు నాగేంద్రబాబు లక్ష్మణరావులను సస్పెండ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో సంబంధించిన రికార్డులను పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేటరూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వివిధ కిరాణం, పాన్‌షాపుల్లో ఆదివారం సీఐ మన్మధకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కా, పాన్ మసాలా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 1200 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్టు షాపుల్లో తనిఖీలు నిర్వహించి 22క్వార్టర్ బాటిళ్లు, 14 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైన్స్‌షాపు వర్కర్లపై దాడి

శాలిగౌరారం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని శ్రీదేవి వైన్స్‌షాప్‌లో పనిచేస్తున్న వర్కర్లపై మండల బీజేపీ అధ్యక్షుడు తోట వినోద్‌కుమార్ దాడి చేశారు. వైన్స్‌లో పని చేస్తున్న వర్కర్లు బట్ట చిన్న సైదులు, బట్ట సాయికుమార్ ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తోట వినోద్‌కుమార్ మద్యం మత్తులో వైన్స్‌లోకి వెళ్లి దుర్భషలాడుతూ వైన్స్ ఓనర్ల ఫోన్ నెంబర్లు కావాలంటూ హల్‌చల్ చేశాడు. అందులో పనిచేస్తున్న క్యాషియర్ బట్ట చిన సైదులు, మరో వర్కర్ సాయికుమార్‌పై దాడి చేశాడు. తమను కులం పేరుతో దూషించాడని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వినోద్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని డిమాండ్ చేస్తూ కొందరు పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. సైదులు తెలిపారు.



దాడిలో గాయపడిన సైదులు, సాయికుమార్

కోడె దూడ స్వాధీనం

కోదాడ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామంలో నామవరపు వెంకటరత్నం ఇంటి వద్ద షేక్ ఇస్మాయిల్ ఉంచిన కోడెదూడను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇస్మాయిల్, నామవరపు వెంకటరత్నంలు అక్రమంగా గోవులను వధించి మాంసం విక్రయిస్తున్నారని తెలిపారు. సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి గోవును సంరక్షణ నిమిత్తం గోశాలకు పంపినట్లు తెలిపారు.

బ్యాటరీలు దొంగతనం చేస్తున్న ఇద్దరు అరెస్టు

నల్లగొండ క్రైం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలతో పాటు ట్రాక్టర్, ఆటోల బ్యాటరీలు దొంగతనం చేస్తున్న ఇద్దరిని నల్లగొండ జిల్లా కనగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చండూరు సీఐ కె. ఆదిరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. నల్లగొండ పట్టణానికి చెందిన సముద్రాల కృష్ణ, షేక్ టిప్పు సుల్తాన్ వాహనాల బ్యాటరీలు, బైక్‌లు దొంగతనం చేస్తుండేవారు. గత నెల 27వ తేదీన కనగల్ మండలంలోనీ కేటీ తండా గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డి రోడ్డు పక్కన వ్యవసాయ క్షేత్రం వద్ద ద్విచక్ర వాహనం పార్క్ చేశాడు. వ్యవసాయ పనులు ముగించుకొని వచ్చే సరికి అక్కడ ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం 8గంటలకు కనగల్ పోలీసులు నల్లగొండ-దేవరకొండ రహదారిపై కనగల్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు నల్లగొండ వైపు నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న ఆటోతో పాటు మోటార్ సైకిల్‌పై వెళ్తూ పోలీసులకు అనుమానాస్పందగా కన్పించారు. పోలీసులను చూసిన తిరిగి వెనక్కి వెళ్తుండగా పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. వారి వద్ద 20బ్యాటరీలు దొరికాయి. రెండు వాహనాలతో పాటు వాహనాలు నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. పలుచోట్ల పార్కింగ్ చేసిన వాహనాల్లో బ్యాటరీలల్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును చేధించిన ఎస్ఐ కె.రాజీవ్‌రెడ్డి, కానిస్టేబుల్ ఎం. రవీందర్‌రెడ్డి, వెంకన్న, శేఖర్, సురేష్, రమేష్, వెంకట్‌రెడ్డిలను ఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న చండూరు సీఐ ఆదిరెడ్డి

'కాళేశ్వరం' అవినీతిలో దోషులను శిక్షించాలి

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చండూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినవారు ఎంతవారైనా సరే దోషులను కఠినంగా శిక్షించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం ఒక కుటుంబం ఆర్థిక లబ్ధి కోసం చేపట్టారన్నారు. అధికారుల నిర్లక్ష్యం, డిజైన్ లోపంతో అవినీతి చోటు చేసుకుందని, తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా కాదని మేడిగడ్డ వద్ద నిర్మించారన్నారు. కాళేశ్వరం డిజైన్ లోపంతో కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అయిందని, ఈ నిర్లక్ష్యానికి కారకులు ఎంతటి వారైనా సరే ఈ ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సూచించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి లక్షల కోట్లతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల కుంభకోణం, లిక్కర్ స్కామ్, గ్రానైట్ మాఫియా, ఇసుక మాఫియా, భూ మాఫియాలకు పాల్పడిన వారిని శిక్షించాలని ప్రజలు కోరుకుంటున్నారని, వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు.

సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషిచేయాలి

చిట్యాల, ఆగస్టు3, (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న ఆశయసాధనకు కృషి చేయాలని గౌడ్స్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్(గోపా) రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో ఆదివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న జరిగే సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. గౌడ కులస్థుల్లోని పేద విద్యార్థులకు సంఘం ఆర్థికంగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దంతూరి సైదులుగౌడ్, నాయకులు మారగోని రమేష్‌గౌడ్, మేకల శివగౌడ్, రేగులగడ్డ నర్సింహ్మ, పుల్లెంల కోటయ్య, ఊయ్యాల మల్లేష్, కూనూరు మధు, బాలగోని లింగయ్య పాల్గొన్నారు.

నల్లగొండ: గోపా ఆధ్వర్యంలో జిల్లాలో ముమ్మరంగా సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గోపా జిల్లా అధ్యక్షుడు దంతూరి సైదులు గౌడ్ తెలిపారు. ఆదివారం జిల్లా గౌడ్ ఆఫీషియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) జిల్లా కమిటీ సమావేశం నల్లగొండలో జరిగింది. గోపా స్వర్ణోత్సవాల సందర్భంగా పేదలకు అల్పాహారం వితరణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు లాల్‌బహదూర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నేలపట్ల శ్రీధర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, శ్రీనయ్య, శంకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో అల్పాహారం పంపిణీ చేస్తున్న నాయకులు

నేతన్నలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నేతన్నలందరికీ ఉచిత విద్యుత్ ఇవ్వాలని చేనేత ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు కటకం పెద్ద వెంకటేశం కోరారు. యాదాదిభువనగిరి జిల్లాకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో చేనేత రంగం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ నేత కార్మికులు అనేక ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోచంపల్లి, గద్వాల మరమగ్గాలకు ప్రసిద్ధి అయిన సిరిసిల్ల, భువనగిరి, మరో భీవండిగా పేరున్న రఘునాథపురంలో ఎంతోమంది నేతన్నలు వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారన్నారు.

యాచకుడు మృతి



వలిగొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి వలిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం యాగశాల వద్ద సుమారు 70 సంవత్సరాలు వయస్సున్న యాచకుడు ఆదివారం మృతిచెందాడు. ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవస్థాన చైర్మన్ నరేష్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. యాచకుని స్వామి అలియాస్ లింగస్వామిగా పిలుస్తారని తెలిసిందని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యాపేటరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాయినిగూడెం గ్రామానికి చెందిన గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి(50) ఐఎంఎ ఫంక్షన్‌హాల్ సమీప బంధువు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా జనగాం క్రాస్ రోడ్డు సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి ఢీకొంది. దీంతో శ్రీనివాస్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు శ్రీనివాస్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి



పెద్దవూరలో ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గృహాల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్ర ఆదివారం పెద్దవూర మండలకేంద్రానికి చేరుకుంది. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయడంలేదని, పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందన్నారు. తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలోని ఎస్‌వో సరిగా సమయపాలన పాటించడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. కస్తూర్బాగాంధీ విద్యాలయానికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఎస్‌వో సమయపాలన పాటించడం లేదని, దీనివల్ల విద్యార్థులు, వారి తల్లింద్రులకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొండమల్లేపల్లి, పీఏపల్లికి చేరుకున్న సైకిల్‌యాత్రకు విద్యార్థులు స్వాగతం పలికారు. కేజీబీవీ బాలికల పాఠశాలలో సుమారు 250 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఇప్పటి వరకు దుప్పట్లు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కుర్ర సైదానాయక్, దుబ్బ రామచంద్రు, బషీర్, శోభన్‌నాయక్, కోరే రమేష్, బుడిగ వెంకటేష్, ముస్కు రవీందర్, మారుపాక కిరణ్, స్పందన, జగదీష్, సాయి, జగన్, వీరన్న, రాకేష్ శివ, ప్రణీత్, భార్గవ్, వెంకటేష్, స్పందన, రమేష్, కిరణ్, రవిందర్, రాకేష్, వినోద్, జగన్, రాజేష్, రామలింగం, గణేష్, వీరన్న, శంకర్, నవదీప్ పాల్గొన్నారు.

మోతాదు మించితే ముప్పే..

● పంటల్లో అధికంగా ఎరువులు వాడితే దిగుబడిపై ప్రభావం ● నేల, పర్యావరణానికి హాని ● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సూచనలు

మన దేశంలో 80దశకం వరకు పంటల సాగులో సేంద్రియ ఎరువులు కీలక పాత్ర పోషించాయి. తరువాత కాలంలో పంటల ఉత్పత్తి పెంపు కోసం రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడుతున్నారు. ఈ పరిణామంతో పంట, నేలతో పాటు పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. పంటల సాగు రైతన్నకు గిట్టుబాటు కావడం లేదు. వరి సాగుచేసే రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడకుండా సిఫారసు మేరకు వినియోగించుకుంటే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చని నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ రైతులకు సూచిస్తున్నారు. వరిలో ఎరువుల వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు.



● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ (వ్యవసాయం)

వరి నాటే పద్ధతిలో ప్రతి ఎకరాకు పంట కాలానికి 48 కిలోల నత్రజని(105 కిలోల యూరియా)20 కిలోల భాస్వరం (43 కిలోల డీఏపీ) 16కిలోల పొటాష్(30 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) లను వేసుకోవాలి.

● దమ్ము సమయంలో యూరియా- 30కిలోలు, డీఏపీ-45-50 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్-15కిలోలు.



● పిలక దశలో యూరియా-30 కిలోలు,

● అంకురం దశలో యూరియా-35 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ -30కిలోలు వేసుకోవాలి.

డీఏపీ కాకుండా 20-20-13 రూపంలో వేసుకున్నపుడు

● దమ్ములో యూరియా 15కిలోలు, 20-20-13 వంద కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్-15కిలోలు

● పిలక దశలో యూరియా-35 కిలోలు, అంకురం దశలో యూరియా -35 కిలోలు, పొటాష్ -15కిలోలు వేసుకోవాలి

వరి విత్తనాన్ని నేరుగా వేసే పద్ధతిలో..

● వరి నేరుగా విత్తే పద్దతలో (వెదజల్లడం, డ్రమ్ సీడర్)మొదటి దశలో యూరియాను వాడకూడదు,

● విత్తిన 15 రోజులకు 35కిలోల యూరియా, తడి పొలంగా మార్చిన తర్వాత యూరియా 25 కిలోలు, మరో 30 రోజులకు 35 కిలోల యూరియా అందించాలి.

వరిని మెట్ట పద్ధతిలో విత్తినపుడు ఇనుపధాతు లోపం కనిపించి మొక్కల ఆకులు పసుపు రంగుకు తర్వాత తెలుపుగా మారి చనిపోతాయి. నివారణం కోసం ఐరన్ కలిగిన సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలి.

భాస్వరం ఎరువులు అధికమైతే..

పంటకు వాడే భాస్వరంలో మొక్కకు కేవలం 16-20 శాతం మాత్రమే వినియోగించుకుంటాయి. మిగతా భాగం అంతా నేలలో ఉండిపోతుంది. నేలలోని పోషకాల అసమతుల్యాకు కారణమై పంటలో ప్రధానంగా జింకు, ఇనుప ధాతు లోపాలు కనిపిస్తాయి. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు క్షీణిస్తాయి.

రైతులు భాస్వరం (డి.ఎ.పి.ఇతర కాంప్లెక్స్ ఎరువులు)దమ్ము, దుక్కిలో మాత్రమే వేసుకోవాలి. కుదరని పక్షంలో పంట వేసిన 15 రోజుల లోపు వేసుకోవాలి. తరువాత వేస్తే భాస్వరం మొక్కకు ఉపయోగకరంగా ఉండదు.

యూరియా మోతాదుకు మించితే..

● మొక్కలు ఏపుగా పెరగడంతో కర్రలో గట్టిదనం లోపిస్తుంది.. చిన్న పాటి గాలులకు పంట పడిపోతుంది.

● చీడ పీడల సమస్య అధికమవుతుంది.

● నేలతో పాటు, నీరు, గాలి కలుషితం అవుతాయి.

● వాతావరణం హరిత వాయువులతో కాలుష్యానికి కారణమవుతుంది.

● రసాయనిక ఎరువులో ఉండే లవణాలు నేలను చౌడుగా మారుస్తాయి.



కాల్వలు పారి 58 వసంతాలు

1967 నుంచి సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల

ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాకముందే కాల్వలకు నీరు



1967లో స్విచ్చాన్ చేసి సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తున్న నాటి ప్రధాని ఇందిరాగాంధీ (ఫైల్)

నాగార్జునసాగర్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణగా విరాజిల్లుతున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్‌కు 1955 డిసెంబరు 10వ తేదీన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తవ్వకుండానే 1967 ఆగస్టు 4వ తేదీన నాటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. నీళ్లు లేక బీళ్లుగా ఉన్న భూములను సస్యశ్యామలం చేసి హరిత విప్లవానికి నాంది పలికి, రైతులను రారాజులను చేసి, జొన్న అన్నం తింటున్న ప్రజలకు సన్న అన్నం తినే దశకు తెచ్చి నేటికి 58ఏళ్లు పూర్తయ్యాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ప్రాజెక్టు వద్ద కుడి వైపున జవహర్‌లాల్ నెహ్రూ పేరుతో కుడి కాల్వను, పొట్టి చెల్మవద్ద లాల్ బహదూర్ శాస్త్రీ పేరుతో ఎడమ కాల్వను నిర్మించారు. కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్‌కు తొమ్మిది తూములు, ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్‌కు మూడు తూములు ఏర్పాటు చేశారు.

కుడి కాల్వ గురించి క్లుప్తంగా..

- కుడి కాల్వ పొడవు 245మైళ్లు కాగా కుడి కాల్వ పరిధిలో మొత్తం 11,11,410 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది.
- కుడి కాల్వ 21వేల క్యూసెక్కుల వరద ప్రవాహంతో నిర్మించారు.
- కుడి కాల్వ పరిధిలో 178 చిన్న, పెద్ద వాగులు నింపుతుంది.
- కుడి కాల్వకు జవహర్‌లాల్ నెహ్రూ కెనాల్‌గా నామకరణం చేశారు.
- కుడి కాల్వ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తాగు, సాగునీరు అందుతుంది.

ఎడమ కాల్వ గురించి క్లుప్తంగా..

- ఎడమ కాల్వ లాల్ బహదూర్ శాస్త్రీ కెనాల్‌గా నామకరణం చేశారు.
- ఇది సాగర్ డ్యాంకు ఆరు కిలో మీటర్ల దూరం ఉంటుంది.
- ఎడమ కాలువ సొరంగం 32 అడుగుల వ్యాసం, 8465 అడుగుల నిడివి కలిగి ఉంది. ఇది 218 మైళ్ల దూరం ప్రయాణిస్తుంది.
- ఎడమ కాల్వ పరిధిలో 138 చిన్న, పెద్ద వాగులు, మూసీ నదిని దాటుతూ వెళ్తుంది.
- ఎడమ కాల్వ పరిధిలో 11,24,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది.
- ఎడమ కాల్వ ద్వారా తెలంగాణలో నల్లగొండ, సూర్యాపేట, , ఖమ్మం జిల్లాలకు, ఏపీలో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలకు సాగు, తాగు నీరు అందుతుంది.

లక్షణంగా పుత్తడి



బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్యులు కొనుగోలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. తులం బంగారం ధర రూ.లక్షకు చేరుకుంది. నాలుగు నెలల క్రితం తులం ధర రూ.90వేలు ఉండగా ఇప్పుడు రూ.లక్ష దాటింది. నాలుగు నెలల్లోనే రూ.10వేలకుపైగా పెరిగిపోయింది. వెండి కూడా బంగారంతో పోటీ పడుతోంది. నెల రోజుల క్రితం తులం రూ. 900 ఉన్న వెండి ప్రస్తుతం రూ.1150కు చేరింది. ఈ పరిస్థితుల్లో బంగారం కొనుగోలు చేయగలమా అని మధ్యతరగతి వర్గాలు సతమమతవుతున్నాయి. వెలవెలబోతున్న బంగారం దుకాణాలతో చేతినిండా పని లేక స్వర్ణకారులు మరో పని వెతుక్కుంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, రామగిరి

- పెళ్లిళ్ల సీజన్‌లోనూ పడిపోయిన విక్రయాలు
- వెలవెలబోతున్న బంగారం దుకాణాలు
- చేతినిండా పనిలేక మరో పని వెతుక్కుంటున్న వృత్తిదారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని స్వర్ణకారుల వేడుకోలు

డబ్బులు ఉన్నప్పుడు మధ్య తరగతి వారు శుభ ముహూర్తాలు లేకున్నా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతుందని, ఆడపిల్లల పెళ్లిళ్లకు ఉపయోగపడుతుందని బంగారం కొనుగోలు చేసుకుని ఉంచుకునేవారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో డబ్బులున్న వారు సైతం వివాహం వంటి శుభ ముహూర్తాలు ఉన్నా, ఇంట్లో ఆడపిల్లలకు పెట్టాల్సి ఉన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. మధ్య తరగతి వారైతే బంగారం ఊసే ఎత్తే పరిస్థితి లేదు. వెండి ధర కూడా పెరిగిపోయింది. దేశీయ, అంతర్జాతీయ పరిణామాల కారణంగా నాలుగు నెలలుగా బంగారం, వెండి ధరలు అమాంతం పెరిగిపోయాయి. నెలల్లోనే తులం బంగారం రూ.1.20లక్షలు చేరే అవకాశం ఉన్నట్లు అంచనాలు వేస్తున్నారు.

బంగారం ధర పెరగడానికి కారణాలు..

అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం, క్రూడాయిల్‌కు మంచి విలువ మార్కెట్ ఉంటుంది. పారిశ్రామికవేత్తలు వీటి ధరల హెచ్చుతగ్గులను ఎప్పటికప్పుడు చూసుకుంటూ వ్యాపార లావాదేవీలు నడిపిస్తుంటారు. ఎక్కువ శాతం క్రూడ్ అయిల్ వంటి విలువైన ఇంధనంపై పెట్టుబడి పెట్టే పారిశ్రామికవేత్తలు బంగారంపై పెట్టుబడులపై మక్కువ చూపడం వల్లే ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. విదేశాల నుంచే ఎక్కువగా దిగుమతి అవుతున్నందున పన్నుల శాతం పెరిగినందున ధర పెరుగుదలకు మరో కారణమని జ్యూయలరీ వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితి చూస్తే బంగారం, వెండి ధరలు పెరిగేదే తప్ప తగ్గే అవకాశం ఏ మాత్రం లేదని చెబుతున్నారు.

సామాన్యులకు అందని ద్రాక్షే

తెలుగు ప్రజల కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు చేస్తే మొదటి ప్రాధాన్యం బంగారానికే ఇస్తుంటారు. గతంలో ఉన్నత వర్గాలు 20 నుంచి 50 తులాల వరకు కొనుగోలు చేస్తుండగా, మధ్య తరగతి వర్గాలు కనీసం 5 తులాల వరకు కొనుగోలు చేసేవి. పేద కుటుంబాల వారు కనీసం తులం బంగారమైన కొనుగోలు చేసేవారు. కాని ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కనీసం తులం బంగారం కొనాలన్నా రూ.లక్ష వరకు వెచ్చించాల్సిందే.

సగానికి పైగా పడిపోయిన విక్రయాలు

గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో కొనుగోలుదారులతో కళకళలాడిన బంగారం దుకాణాలు ప్రస్తుతం శ్రావణమాసం, వివాహ శుభ ముహూర్తాలు ఉన్నా దుకాణాల్లో ఆ సందడి లేదు. పెరిగిన ధరల కారణంగా దుకాణాలు వెల వెల బోతున్నాయి. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, చిట్యాల, మాల్, నార్కట్‌పల్లి, మునుగోడు, మల్లేపల్లి, సంస్థాన్‌నారాయణపురం వంటి పట్టణాల్లో కలిపి సుమారు 2నుంచి 3వేల జ్యూయలరీ దుకాణాలు ఉంటాయి. వీటి ద్వారా ప్రతిరోజూ 15నుంచి 20కిలోల వరకు బంగారం విక్రయాలు సాగుతుంటాయి. వివాహ శుభముహూర్తాల్లో విక్రయాలు రెట్టింపు స్థాయిలోనే జరిగేవి. ప్రస్తుతం వివాహ శుభ ముహూర్తాలు ఉన్నప్పటికీ ప్రస్తుతం ధర రూ.లక్ష పై చిలుకు చేరడంతో 3 నుంచి 4 కిలోలు మాత్రమే విక్రయాలు జరుగుతున్నట్లు మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు. దీనిబట్టి బంగారం వ్యాపారం 60శాతం పైగా పడిపోయినట్లు స్పష్టమవుతోంది.

25 ఏళ్లుగా బంగారం ధరలు


సంవత్సరం	ధరలు
2000	4000
2001	4520 - 5000
2002	5000 - 5500
2003	5500 - 6000
2004	6000 - 6500
2005	6500 - 7600
2006	8200 - 9900
2007	9500 - 10,500
2008	12,000 - 13,000
2009	14,800 - 16,500
2010	21,200 - 22,000
2011	22,000 - 29,500
2012	30,000 - 30,500
2013	30,500 - 33,000
2014	30,000 - 27,500
2015	27,200 - 27,500
2016	30,000 - 30,500
2017	28,500 - 30,000
2018	31,000 - 32,400
2019	33,600 - 39,500
2020	40,600 - 52,000
2021	47,500 - 51,000
2022	50,000 - 52,000
2023	58,000 - 61,500
2024	64,000 - 78,900

2025 (జనవరి నుంచి జూలై వరకు) - 81,000 - 99,500

2025 ఆగస్టు నెలలో - (బంగారం) 1,00700 - వెండి (1150)



ధరల ప్రభావం వృత్తిదారులపై పడింది



బంగారం, వెండి ధరల పెరుగుదల ప్రభావం ప్రధానంగా బంగారం పనిచేసే వృత్తిదారులపై పడింది. పెరిగిన ధరలతో బంగారం కొనుగోలు చేయాలంటే వినియోగదారులు ఆలోచిస్తున్నారు. ఆర్డర్ ఇస్తే పెట్టుబడులు పెట్టి వస్తువులు తయారు చేయాల్సి వస్తుంది. ఆర్డర్ తీసుకునే సమయంలో ఉన్న ధర డెలివరీ సమయంలో ఉండడం లేదు. అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టిన వారు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి. మరికొంతమంది కస్టమర్లు రెడీమేడ్ జ్యూయలరీ షాపుల వైపై మొగ్గు చూపడంతో వృత్తిదారులకు పని లేకుండా పోతోంది.

- పులిపలుపుల లింగాచారి, స్వర్ణకారుడు, నల్లగొండ.

సామాన్యులు కొనలేని పరిస్థితి



పెరిగిన ధరలకు కారణంగా సామాన్యులు బంగారం కొనలేని పరిస్థితి. కనీసం తులం బంగారం కొనుగోలు చేయాలన్నా రూ.లక్ష కావాల్సిందే. వెండి కూడా తులం ధర పెరిగింది.

ఈ పరిస్థితుల్లో బంగారం కొనుగోలు చేయలేం. మధ్యతరగతి వర్గాలవారు ఆడపిల్లల పెళ్లిల సమయాల్లో అయిన బంగారం కొనాలంటే అప్పులు చేయక తప్పదు. బంగారం, వెండి ధరలు తగ్గితే, కొనుగోలు చేసే మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా ఉంటుంది.

- నల్లమల్ల రాజేశ్వరి, నల్లగొండ

పెట్టుబడులు లేక కుటుంబ పోషణ భారమైంది



కార్పొరేట్ వ్యవస్థతో పోటీ పడలేక, ధరల హెచ్చుతగ్గులతో వృత్తి చేసుకునేవారికి చేతినిండా పనిలేక కుటుంబ పోషణ భారమైంది. ధరల పెరుగుదల కారణంగా వృత్తినే నమ్ముకున్న స్వర్ణకారులు ఇతర రంగాలకు పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్వర్ణకారులను ప్రభుత్వాలు ఆర్థికంగా ఉన్నట్లుగా పరిగణిస్తాయి. కాని ప్రభుత్వ అంచన కేవలం పదిశాతం మాత్రమే మిగిలిన 90శాతం ఆర్థికంగా వెనుకబడిన వారే. కొంతమంది స్వర్ణకారులు వృత్తినే మానేసి భవన నిర్మాణ రంగంలో, హోటళ్లలో పని చేయడానికి వెళ్తున్నారు.

- కన్నెకంటి సత్యనారాయణచారి, స్వర్ణకార సంఘ రాష్ట్ర మాజీ నాయకుడు

ఎత్తిపోతల వద్ద రైతుల నిరసన



ఎత్తిపోతల పథకానికి తాళం వేయడంతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

వేములపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని తిమ్మారెడ్డిగూడెం, మొల్కపట్నం, పచారిగడ్డ గ్రామాల సాగు భూమికి నీరు అందించే ఎల్-16 ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైపులైన్ లీకై తన పంటకు నష్టం కలిగిస్తున్నా పట్టించుకోవడం లేదని ఓ రైతు ఎత్తిపోతల పథకానికి తాళం వేశాడు. సమీప రైతులు విషయాన్ని ఎన్ఎస్పీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో రైతులు ఎత్తిపోతల వద్ద ఆదివారం నిరసన తెలిపారు. సమీపంలోని ఎడమకాల్వ నుంచి నీరు ప్రవహిస్తున్నా తమ పొలాలకు మాత్రం అందే పరిస్థితి లేకపోవడంతో ఎన్ఎస్పీ అధికారులను ఆశ్రయించారు. ఎత్తిపోతల నిర్వహణ రైతులే చూస్తున్నందున తాళం వేసిన రైతుతో రైతులే మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. చేసేదేమీ లేక కొందరు రైతులు ఎత్తిపోతలకు రైతు వేసిన తాళాన్ని పగులగొట్టారు. అధికారులు సకాలంలో స్పందించి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయిస్తే ఈ పరిస్థితి దాపురించేది కాదని రైతులు తెలిపారు. అధికారుల అలసత్వంతోనే రైతులు ఘర్షణ పడాల్సిన పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఏఈ పాండునాయక్‌ను వివరణ కోరగా లీకేజీ విషయమై ప్రతిపాదనలు తయారు చేసి టెండర్ పిలిచామని త్వరలోనే లీకేజీలకు మరమ్మతులు చేయించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు దేశిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వల్లపుదాసు వెంకటయ్య, భగవాన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్వాయి సైదులు, వంశీ, కొండలు, రవి ఉన్నారు.

జావెలిన్‌త్రోలో బంగారు పతకం



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మంచాల హర్షిణి జావెలిన్‌త్రో పోటీల్లో బంగారు పతకం సాధించింది. జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ జావెలిన్ త్రో పోటీలలో హర్షిణి ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్ తెలిపారు. వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్ జీన్సీ, హెచ్ఎం సుజయ్‌కుమార్, పీఈటీలు నీలం రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనాన్ని సందర్శించిన నటి యమున



మహాస్తూపంలోని బుద్ధుడి ధాతువుల వద్ద బుద్ధజ్యోతి వెలిగిస్తున్న నటి యమున

నాగార్జునసాగర్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నిర్మించిన బుద్ధవనాన్ని సినీ నటి యమున ఆదివారం సందర్శించారు. ధ్యాన కేంద్రంలో పది రోజుల ధ్యాన కోర్సు పూర్తి చేసుకున్న ఆమె ధ్యాన కేంద్రం పక్కనే ఉన్న బుద్ధవనాన్ని సందర్శించారు. మహా స్థూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధుడి ధాతువుల వద్ద బుద్ధ జ్యోతి వెలిగించారు. అమెకు బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, ఈవో శాసన పంచశీల కండువా అందజేశారు. బుద్ధవనంలోని జాతక వనం, స్థూప వనం, చరిత్ర వనం, ధ్యాన వనం, మహాస్థూపం గురించి పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

- స్వర్ణ గోపురానికి తొలిసారి వేడుక
- పవిత్రీకరించి మాలధారణకు పరంజా బిగింపు
- వివిధ ప్రదేశాలకు వెళ్లేందుకు క్యూఆర్ కోడ్



వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ బోర్డు

యాదగిరిగుట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం నుంచి ఆరో తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు అర్చక బృందం సిద్ధమైంది. వార్షిక, నిత్య పూజాది కార్యక్రమాల్లో ఆలయంలో తెలిసో తెలియకో జరిగిన దోషాలు, పొర పాట్ల సవరణకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆచారంగా వస్తోంది. వేడుక నిర్వహణకు అర్చక బృందం పవిత్ర రూపకల్పనలో నిమగ్నం కాగా, పాతగుట్ట ఆలయంలో కూడా యథావిధిగా కొనసాగనున్నాయి. వేడుకల సందర్భంగా 5, 6 తేదీల్లో ఉభయ ఆలయాల్లో శాశ్వత, నిత్య కల్యాణం, బ్రహోత్సవాలు, లక్ష పుష్పార్చన, శ్రీ సుదర్శన నారసింహ హోమం రద్దు చేస్తున్నట్లు దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

తొలిసారి పవిత్రీకరణ

సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 23న ప్రారంభించిన స్వర్ణ దివ్య విమాన రాజగోపురాన్ని పవిత్రీకరిస్తారు. 163 రోజుల్లో తొలిసారి జరగనున్న వేడుకల విజయవంతానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 50 అడుగుల ఎత్తులో (ఐదు అంతస్తులు) గోపురం పవిత్రీకరణ



పశ్చిమ రాజగోపురం వద్ద ఎస్పీఎఫ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో వెంకట్రావు

వేడుకగా సాగనుంది. శ్రీ సుదర్శన ఆళ్వారుడికి తొలుత పవిత్రాధారణ చేసేందుకు స్వర్ణ గోపురాన్ని అభిషేకించేందుకు చుట్టూ పరాంజ బిగించారు.

మూడు రోజుల కార్యక్రమాలు

ఆలయంలో మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 వరకు భగవదనుజ్ఞ, స్వస్తివాచనం, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అఖండ దీపారాధన, అంకురారోపణ, అంకురార్పణ హోమం, పవిత్రాదివాసం, రెండో రోజు మంగళవారం ఉదయం 8.30 గంటలకు స్నపన తిరుమంజనం, యాగశాలలో ద్వార తోరణం, ధ్వజ కుంభారాధన, మూర్తి కుంభారాధన, మండల ఆరాధన అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు, పవిత్రారోపణం, నిత్య పూర్ణాహుతి, సాయంత్రం 6.30 గంటలకు సాయమారాధన, ద్వారపూజ, చతుఃస్థానార్చన, మూర్తి మంత్ర విశేష హోమాలు, స్వర్ణమయ దివ్య విమాన సుదర్శన చక్రఆరాధన, పవిత్ర సమర్పణ, నిత్య పూర్ణాహుతి, బుధవారం మూడో రోజు ఉదయం 8.30 గంటల నుంచి ద్వార తోరణం, ధ్వజ కుంభారాధన, చతుఃస్థానార్చన, మూలమంత్ర, పరివార, శాంతి, ప్రాయశ్చిత్త హోమాలు, శాలబలి, మహా పూర్ణాహుతి, పవిత్ర అవరోపణం, మహాకుంభప్రోక్షణం, పండిత సన్మానం, వేద ఆశీర్వచనంతో ఉత్సవ పరిసమాప్తి కానున్నాయి.

30 గ్రాముల ఉచిత ప్రసాదం డొప్పల్లో అందించాలి: ఈవో

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు తరలివస్తున్న భక్తులకు నిత్య అందించే ప్రసాదం 30 గ్రాములు మించకుండా, తగ్గకుండా నాణ్యతగా అందించాలని దేవాదాయ డైరెక్టర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు అన్నారు. కొండపైన ఆదివారం ఆలయ వెలుపలికి వచ్చే భక్తుల క్యూలైన్‌లో ఉదయం ఉచిత ప్రసాద పంపిణీ, సాయంత్రం ప్రసాదాల టికెట్టు కౌంటర్ పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. భక్తులకు చేతుల్లో ప్రసాద వితరణ చేయడం సరికాదని, ఆలయ, ప్రసాదాల విభాగం అధికారులను డొప్పలు అందుబాటులోకి తేవాలన్నారు.ఆలయ లోపల, పరిసరాల్లో భద్రత కట్టుదిట్టం చేసేందుకు డ్రోన్ కెమెరాల నిషేధ ఆజ్ఞలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇందుకోసం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులు పశ్చిమ రాజగోపురం ద్వారా వెలుపలికి వెళ్లేందుకు అనుమతించాలన్నారు. స్వయం ప్రోటోకాల్ ద్వారా దర్శించుకు నేందుకు వచ్చే వీఐపీలు మినహా ధర్మదర్శనం, ప్రత్యేక దర్శనం ద్వారా మాత్రమే స్వామివారిని దర్శించుకోవాలన్నారు. భద్రతకు అవసరమగు అధునిక పరికరాలను వినియోగించాలని ఆదేశించారు. పునః ప్రారంభించే వరకు పశ్చిమ తరాజగోపురం ద్వారా భక్తులను ఎవరిని అనుమతించ వద్దని ఆయన వెంట ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో జూశెట్టి క్రిష్ణ, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ గూడెం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొనగా ఎస్పీఎఫ్ సిబ్బంది తగు సూచనలు చేశారు.

క్యూఆర్ కోడ్‌తో భక్తులకు సులభతరం

యాదగిరిగుట్ట దేవస్థానం సందర్శనకు తరలివచ్చే భక్తులకు పరిసరాల్లో వివిధ ప్రదేశాలకు చేరేందుకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఈవో ఎస్.వెంకట్రావు చెప్పారు. కొండపైన ఆదివారం ఆయన మాట్లాడుతూ కొండకింద క్యూఆర్ కోడ్ ద్వారా స్కానర్స్‌తో కూడిన బోర్డు అందుబాటులో ఉందన్నారు. ఎక్కడకు వెళ్లాలి..ఎలా వెళ్లాలి అనే తెలిపేందుకు ప్రత్యేకంగా బోర్డులను వైకుంఠద్వారం (హనుమాన్ సర్కిల్) ప్రధాన కూడలీ వద్ద ఏర్పాటు చేశామన్నారు. క్షేత్ర పరిసరాల్లో 15 స్థానాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు నిమగ్నం కాగా త్వరలో అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్ ద్వారా భక్తులకు ఆలయానికి సంబంధించిన ప్రదేశాలకు తెలుసుకునేందుకు సులభతరంగా ఉంటుందన్నారు.

నిత్యాదాయం రూ. 44.57 లక్షలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 40 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు ఒక గంట ధర్మదర్శ నాలకు రెండుగంటల సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యా ణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరు వీధులు, ప్రసాద విక్రయ శాలల్లో వద్ద కూడా రద్దీ నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు పోటీ పడ్డారు. అదే విధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. సాయంత్రం చేపట్టిన స్వామిఅమ్మవారల తిరువీధి సేవలో ఈవో పాల్గొన్నారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 44,57,014 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.



సుదర్శన చక్రం అభిషేకించి పవిత్రధారణ చేసేందుకు పరంజా సిద్ధం చేసిన స్వర్ణ గోపురం

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారలను మేల్కొలిపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామిఅమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు.

స్వామివారిని దర్శించుకున్న విద్యార్థులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి రంగారెడ్డి జిల్లాకు చెందిన పదో తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థులు సుమారు 250మంది విద్యార్థులు వచ్చారు. సాయంత్రం సమయంలో వస్తున్న విద్యార్థుల సమూహాన్ని చూసి స్థానిక ఆటో డ్రైవర్లు, భక్తులు ఆశ్చర్యపోయారు. రంగారెడ్డి జిల్లా మొయినా బాద్‌కు చెందిన శ్రీస్వామినారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన రణీర్‌సింగ్, వసంత్, వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు దర్శనాన్ని క్యూలైన్ ద్వారా చేసుకున్నారు. విద్యార్థులు ఆలయ ప్రవేశం సమయంలో ముక్తకంఠంతో నమో నారసింహ నామ జపం చేయడంతో ఆలయం ప్రతిధ్వనించింది.



నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తగ్గిన వరద..సాగర్ గేట్లు మూసివేత

- పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి) :నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక తగ్గింది. దీంతో ఆదివారం ఉదయం 11 గంటలకు సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మూసివేశారు. సాగర్ గేట్లు ఎత్తి గత ఆరు రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకులు సాగర్ అందాలను తిలకించేందుకు వచ్చారు. సాగర్‌కు వచ్చిన పర్యాటకులకు కనీస మౌలిక వసతులు లేనందున ఎండ తీవ్రతకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

● సాగర్‌ను తిలకించేందుకు ఎంతో ఆశతో వచ్చిన పర్యాటకులకు గేట్లు మూసివేయడంతో నిరాశే మిగిలింది. అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో సాగర్ పైలాన్ కాలనీ కొత్త వంతెన నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం వెళ్లే రహదారిలో, అలాగే బైపాస్ రోడ్డులో మూడు కిలో మీటర్ల మేరకు రెండు గంటల పాటు భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. పోలీసులు శ్రమించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



లాంచీ దిగి వస్తున్న పర్యాటకులు

● పర్యాటకుల సంఖ్య అధికంగా ఉండటంతో నాగార్జునకొండకు మూడు ట్రిప్పులు, మరో మూడు జాలి ట్రిప్పులు లాంచీలు నడిపినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. బుద్ధవనానికి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చినట్లు అధికారులు తెలిపారు.

● సాగర్ సమాచారం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 585.90 అడుగులు(300.0315 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 8604 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ ద్వారా 8022 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,926 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 47,552 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 63,580 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

స్నేహితుడికి చేయూత

తిప్పర్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన మర్రి రాంబాబుకు ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి చేయి విరిగింది. దీంతో అతడితో పాటు పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.17వేలు ఆదివారం అందజేశారు. స్నేహితుల దినోత్సవం రోజు ఇలా సాయం అందించడం ఆనందంగా ఉందని స్నేహితులు 'ఆంధ్రజ్యోతి'కి ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నార్కట్‌పల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండల్‌వాయి గ్రామానికి చెందిన చినపాక సుప్రజకు సీఎం సహాయ నిధి నుంచి రూ.60వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును లబ్ధిదారుడి కుటుంబానికి ఆదివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు కార్యక్రమంలో బింగి మహేష్, బింగి కొండయ్య, చింత శివశంకర్, చింత సునీల్, చింత విజయ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం ఆ పాఠశాల

- 510 మంది విద్యార్థులు
- ఈ ఏడాది నూతనంగా 180 అడ్మిషన్లు
- కళకళలాడుతున్న నల్లగొండ పట్టణం దేవరకొండ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల
- అదనపు గదులు లేక ఇబ్బందులు

నల్లగొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సందడిగా మారింది. ఓ వైపు నల్లగొండ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు ఎన్ని ఉన్నా ఆ పోటీని తట్టుకొని ఈ పాఠశాల అత్యధిక నూతన ప్రవేశాలతో కళకళలాడుతుంది. ఇది దేవరకొండ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల ఘనత. దీనికి ప్రధాన కారణం జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల రోడ్డుపై పక్కనే ఉంది. దీంతో వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం, హాస్టల్ వసతి కల్పించడం, దీనికి తోడు తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు డిజిటల్ తరగతుల నిర్వహణ ఉండటం కూడా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దోహదపడింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 510 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా బడిబాట కార్యక్రమంతో మూలంగా 180మంది విద్యార్థులు ప్రవేశం పొందడం విశేషం. మొత్తం 30 మంది ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. అదనంగా తెలుగు సబ్జెక్టుకు ఒక్కరు, హిందీ సబ్జెక్టుకు 1, బయోసైన్స్ బోధించడానికి ఇద్దరూ టీచర్ల అవసరం ఉంది. మొత్తం 20 సెక్షన్లలో తరగతుల నిర్వహణ జరుగుతుంది.





తరగతి గదిలో పాఠాలు చదువుతున్న విద్యార్థులు

పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ సైతం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను నిర్వహిస్తున్నారు. సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం గంట సేపు ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించి వారు ఆంగ్ల భాషను అనర్గళంగా మాట్లాడేందుకు తర్ఫీదు పొందుతున్నారు. దీంతో విద్యార్థులు ఎక్కువ మంది స్పోకెన్ ఇంగ్లీష్‌పై మక్కువ చూపుతున్నారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఇంగ్లీష్‌ను ధారళంగా మాట్లాడే విధంగా ఎప్పటికప్పుడూ పరీక్షిస్తూ తయారు చేస్తున్నారు.



దేవరకొండ రోడ్డులోని పాఠశాల ప్రధాన ద్వారం, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినులు

క్రీడల్లోనూ రాణింపు....

అదేవిధంగా క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఇతర ఆటపోటీల్లో శిక్షణ ఇప్పించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించే విధంగా తయారు చేస్తున్నారు. బాలబాలికలకు వేర్వేరుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌తో గేమ్స్ పిరియడ్‌లో ఆసక్తి ఉన్న క్రీడలను ఎంపిక చేసుకొని వారికి ప్రత్యేకంగా మెళకువలు నేర్పిస్తున్నారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులతో మెడిటేషన్ చేయిస్తున్నారు. పాఠశాల అభివృద్ధి అనుగుణంగా తరగతి గదుల కొరత కారణంగా కూడా ఇబ్బందిగా ఉంది. మరో 4 నుంచి 5 తరగతి గదులను నిర్మిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుంది.

ప్రతి ఒక్కరి సహకారంతో పాఠశాల అభివృద్ధి



ప్రభుత్వ సహకారంతో పాటు ఉపాధ్యాయుల కృషి వల్ల ప్రభుత్వ పాఠశాల ఎంతగానో అభివృద్ధి చెందింది. కొద్ది రోజుల క్రితం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగిన ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు కృషి చేసినందుకు కృతజ్ఞతలు. మొత్తం 510మంది విద్యార్థులు ఉండగా ఇందులో ఈ సంవత్సరమే 180 కొత్త అడ్మిషన్లు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నాం. రాబోయే రోజుల్లో పాఠశాలను మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్తాం. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- ఎండీ యూసుఫుద్దీన్, హెడ్‌మాస్టర్

రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. కేతేపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి రైతులకు కష్టాలు ఆరంభమయ్యాయని తెలిపారు. అధికారులు, అధికార పార్టీ నాయకులు ఫొటోలకు ఫోజులివ్వడం మినహా రైతు సమస్యల పరిష్కారానికి చేసిందేమీ లేదని విమర్శించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు వరద నీరు పోటెత్తుతున్నా సరైన అవగాహన లేని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతూ ఆయకట్టును ఎండబెడుతున్నారని ఆరోపించారు. నీటి పారుదల శాఖ మంత్రి అవగాహనా రాహిత్యం, ముందు చూపులేకపోవడం వల్ల సీజన్‌లో సాగు నీరందక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఇసుక దందా సాగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు దందాలపై ఉన్న శ్రద్ధ అభివద్ధి, సంక్షేమంపై లేదని విమర్శించారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించి ఆయకట్టులోని చెరువులు, కుంటలను నింపాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి, నాయకులు కె.ప్రదీప్‌రెడ్డి, సైదులు, వేణుమాధవరెడ్డి, వెంకన్నయాదవ్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగం బడుగుల ఆశాజ్యోతి : అతార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అతార్‌సింగ్

నార్కట్‌పల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని బహుజనులు రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్సీ బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ అతార్‌సింగ్ అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీఎస్పీ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాల నుంచి రక్షణకు భారత రాజ్యాంగమే ఆశాజ్యోతిగా ఉందన్నారు. దేశ భావి భారత ప్రధానిగా మాయావతి నాయకత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు డి.దయానందరావు, మంద ప్రభాకర్, జి.ధర్మేందర్, కత్తుల కాన్షీరాం, ప్రణయ్, కిరణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

రామగిరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్వర్ణకార సంఘం సభ్యులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచకొండ గిరి, ఇనుగుర్తి గోపి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నల్లగొండ పట్టణ స్వర్ణకార సంఘ ఎన్నికలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 17వ తేదీన నామినేషన్ అదేరోజు సాయంత్రం నామినేషన్ పరిశీలన, 18న నామినేషన్ ఉపసంహరణ, 21న పోలింగ్, అదే రోజు సాయింత్రం ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు వివరించారు. సంఘం సభ్యులు ఓటు నమోదు చేసుకొని పోలింగ్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కన్నెకంటి సత్యం, కూరెళ్ల మదనాచారి, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు మహేశ్వరం బ్రహ్మచారి, నాయకులు దాసోజు వాసు, కన్నెకంటి దుర్గాప్రసాద్, పోలోజు లక్ష్మణ్, దాసోజు మహేశ్, కోల్లోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలు ధర్మపరిరక్షణకు పాటుపడాలి



పీఠాధిపతి వీరకుమారస్వామిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు ధర్మపరిరక్షణకు పాటుపడాలని ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి వీరకుమారస్వామి అన్నారు. మఠం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆయన ఆదివారం నార్కట్‌పల్లిలోని గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నేడు ప్రజలు ధర్మం వీడి ధనం కోసం పాకులాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపకుడు పెండోట సోమయ్య, అర్చకుడు ఉత్తరపల్లి అనంతాచార్యులు, దేవాలయ వైస్‌చైర్మన్ గుంటోజు రమేష్, ధర్మకర్తలు గడగోజు సత్యనారాయణ, పిన్నోజు రామాచారి, గడ్డం సత్తయ్య, కొప్పు భాగ్యమ్మ, పుల్లెంల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోరింటాకు వేడుకలు



గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మహిళలు

రామగిరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మహిళలు శ్రావణమాస గోరింటాకు సామూహిక వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రతీ మహిళ తమ ఇంటి నుంచి గోరింటాకు తీసుకొని వచ్చి చేతులకు అలకరించుకున్నారు. అదేవిధంగా ఒకరికొకరు చేతి నిండా గాజులు వేసుకొని, పండ్లు, స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణమాసంలో ఆచరించే వరలక్ష్మీ వ్రతాలు ఇతర శుభకార్యాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మేకల స్వరూప, సుద్దాల సావిత్రి, కంచనపల్లి లక్ష్మి, కనుకుల లింగమ్మ, కనుకుల భవాని, గుంటోజు శారద, మేకల సంధ్య, గుంటోజు అనుశ్రీ, బోయిల జ్యోతి, కమ్మంపాటి శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలి

శాలిగౌరారం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని శాలిగౌరారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్‌బాబు కోరారు. శాలిగౌరారంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు వన సంపద తరిగిపోతుండటంతో సకాలంలో వర్షాలు కురవడం లేదన్నారు. నేడు పర్యావరణ సమతుల్యత లేక వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, జిల్లా గ్యాట్ ప్రతినిధులు ఎర్ర శంభులింగారెడ్డి, చామల మహేందర్‌రెడ్డి, దునక వెంకన్న, రామడుగు వెంకట్రామశర్మ, క్లబ్ ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, కోశాధికారి గుండు పరమేష్, సభ్యులు మారోజు వెంకటాచారి, గుండ్ల రామ్మూర్తి, మురారిశెట్టి కరుణాకర్, బట్ట చిన్న సైదులు, కప్పల శ్రీకాంత్, పడాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాలను ఎత్తి వేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు అనంతరాజుగౌడ్

మర్రిగూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కల్లు దుకాణాలు ఎత్తివేయాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు అనంతరాజు గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో కల్లు నిషేధించడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. కల్లు విక్రయాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం గడుపుతున్న గౌడ్ అన్నలకు దుకాణాలను నిషేధించడంతో కుటుంబాల పోషణ భారం అవుతుందని ఆయన అన్నారు. కల్తీ కల్లు తయారుచేసి విక్రయిస్తూ దుకాణాల వారిపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేయకుండా ఉండడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షులు పందుల రాములు గౌడ్, పందుల యాదయ్య గౌడ్, పంతంగి శ్రీనివాస్ గౌడ్, సుంకరి మల్లేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొనన పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం, ఆగసు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురజాల జడ్పీ స్కూల్‌లో 2012-13 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించుకున్నారు. పాఠశాలలో చదువుకున్న రోజులను నెమరు వేసుకొని తమ అనుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్దులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కృష్ణ, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మీనారాయణ, కోటి, శ్రీకాంత్, సహదేవ్ మారోజు వెంకటాచారి, రమణమ్మ, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణరాం ప్రసాద్, విద్యార్థులు గూని ఉదయ్, కోక సాయి, యల్మకంటి నరేష్, హరీష్, నాగరాజు, అజయ్, మమత, హారిక, మౌనిక, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న.. భూగర్భజలాలు

(5వపేజీ తరువాయి)



ఎండిన చెరువులో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

బోర్లకు నీరు వచ్చే పరిస్థితి కానరావడంలేదు. వర్షపాతం లెక్కలు సైతం గందరగోళంగా ఉన్నాయి. గ్రామాలవారీగా లెక్కలు లేకపోవడంతో మండలాలు యూనిట్‌గా వర్షాల లెక్కలు వేయడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. చాలా మండలాల్లో అత్యధిక వర్షపాతాలు నమోదైనట్లు లెక్కలు చూపిస్తుండగా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కానరావడం లేదు.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

జిల్లావ్యాప్తంగా మొత్తం 1,828 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో వందలాది చెరువులు నీళ్లు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో ఈ సంవత్సరం పరిస్థితి దారుణంగా తయారైంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాలపైనే భూగర్భజలాల పరిస్థితి ఆధారపడి ఉంది. అయితే ప్రస్తుతం వాతావరణం చూస్తుంటే ఎండ తీవ్రత అధికంగా కనిపిస్తుంది. వర్షాలు మాత్రం కురిసే పరిస్థితులు కానరావడంలేదు. జిల్లాలో శనివారం తీవ్ర ఉక్కపోతతో వాతావరణం ఉండగా ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 34.0డిగ్రీలుగా నమోదైంది. వానాకాలంలో ఎండకాలం మాదిరిగా పరిస్థితులు నెలకొన్నాయని చెప్పవచ్చు. చెరువులు, కుంటలను పరిశీలిస్తే 1,180 చెరువుల్లో గతంలో కురిసిన వర్షాల ఆధారంగా 0-25శాతం మేరకు నీరు ఉండగా, 267 చెరువుల్లో 25నుంచి 50శాతం వరకు, 97 చెరువులో 50నుంచి 75 శాతం మేరకు నీరు ఉన్నాయి. ఇక 80 చెరువుల్లో 75నుంచి 100శాతం వరకు నీరు చేరాయి. ఇక కేవలం మూసీ కింద ఉన్న నాలుగు చెరువుల్లోకి మాత్రం 100శాతం నీరు చేరింది. ఏఎమ్మార్పీ కింద ఉన్న 90 చెరువులకు సంబంధించి నీరు విడుదల వల్ల ఇప్పుడిప్పుడే నీరు చేరుతుండటంతో మిగతా చెరువుల్లో వర్షాల్లేక దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

మునుగోడులో కంటి ఆసుపత్రి నిర్మిస్తాం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : మునుగోడు నియోజకవర్గ ప్రజల కోసం రాబోయే కాలంలో కంటి ఆస్పత్రి నిర్మిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలి పారు. మండలంలోని బంగారిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్, ఫినిక్స్ ఫౌండేషన్ శం కర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరూ కంటి సమస్యతో బాధపడకూడదని, ఆరు నెలలుగా నియోజకవర్గ వ్యాప్తంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరంలో ఆపరేషన్ అవసర మైన వారిని హైదరాబాద్ పంపించి ఆపరేషన్ చేయిస్తున్నామని, ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు 853 మందికి కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. కాగా బంగారిగడ్డలో నిర్వహించిన శిబిరంలో 614 మం దికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 245 మందికి ఆప రేషన్ అవసరమైనట్లు గుర్తించారు. వీరిలో 117 మందిని వెంటనే ఆపరేషన్ కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగిలిన వారిని మంగళవారం పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోరిమి ఓంకారం, జిల్లా నాయకులు కావలి ఆంజనేయులు, పల్లె వెంకన్న, దోటి వెంకటేష్ యాదవ్, గంట సత్యం, మాదగోని విజయలక్ష్మి, పావని, లింగయ్య, పాల్గొన్నారు.

మర్రిగూడ: శివన్నగూడ నీలకంఠ రాముల ఆలయానికి దారి ఇప్పించాలని కోరుతూ శివన్నగూడ దేవస్థానం దేవాదాయ ధర్మదాయ ఆలయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మొర పెట్టుకున్నాడు. ఆదివారం ఎమ్మెల్యే బంగారిగడ్డకు వెళ్తుండగా చర్లగూడెం రిజర్వాయర్ పైలాన్ వద్ద ఆ ఆలయ కమిటీ ఆయనను కలిసి, డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపడుతున్న రిజర్వాయర్ నిర్మాణం పనుల వల్ల ఆలయానికి వెళ్లి దారి పూర్తిగా ముంపు గురైందని దీనివల్ల దారి లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు గురవుతున్నారని ఎమ్మెల్యేకు వెల్లడించారు. స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూబ్రిడ్జిని ఏర్పాటు చేయడానికి సహకరిస్తానని ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆలయ కమిటీ వైస్ చైర్మన్ చిట్యాల రంగారెడ్డి, మాజీ సర్పంచ్ చిట్యాల యాదగిరి రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్ మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, పాల్వాయి అనిల్‌రెడ్డి, అయితగోని వెంకటయ్య, గ్యార వెంకట్ తదితరులు ఉన్నారు.



బంగారిగడ్డలో కంటి పరీక్షలను చేయిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ఏఎమ్మార్పీ నీటితో చెరువులు, కుంటలు నింపుతాం

కేతేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ నీటితో నియోజకవర్గంలోని ఆయకట్టు గ్రామాల చెరువులు, కుంటలు నింపుతామని ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం మండలంలోని ఇనుపాముల, ఉప్పలపహాడ్, కొప్పోలు, భీమారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క ఇల్లు కూడ మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. పేద ప్రజలను పట్టించుకోకుండా గత ప్రభుత్వం రూ.8లక్షల కోట్లు అప్పు చేసి వెళ్లిందన్నారు. కార్యక్రమాల్లో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, కేతేపల్లి ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ బయ్య ముత్తయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, మాజీ ఎంపీపీ పి.శేఖర్, మాజీ జడ్పీటీసీ కోట మల్లికార్జునరావు, కాంగ్రెస్ నాయకులు బి.సుందర్, జి.మాధవరెడ్డి, బడుగుల నరేందర్‌యాదవ్, కె.మహేందర్‌రెడ్డి, టి.సాగర్, సీహెచ్.వెంకన్నగౌడ్, మున్న అశోక్, కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇనుపాములలో ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ తీసుకెళ్లాలి

నల్లగొండ రూరల్ ఆగస్టు 3, (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు గడప గడపకూ తీసు కెళ్లాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బీజేపీ సంపర్క్ అభియాన్ భాగంగా ఆదివారం మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో ఆయన గడప గడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్ ఉన్నారు.

- మునుగోడు: మండల కేంద్రంలో ఇంటింటికి బీజేపీ మహాసంపర్క్ అభియాన్ ఆదివారం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు పంచారు. పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్, జిల్లా అధికార ప్రతినిధి మాదగోని నరేందర్‌గౌడ్‌నాయకులు పందుల యాదయ్య, కొత్త శంకర్, కారింగ్ అనిల్, స్వామి, కొండ మల్లేష్, బొజ్జ రాములు, వనం రవి పాల్గొన్నారు.
- కనగల్: మండలంలోని చిన్నమాదారం గ్రామంలో పదకొండేళ్లుగా ఎన్‌డీఏ సర్కార్ చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. అంతకు ముందు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా స్థానిక ఎన్నికల కన్వీనర్ వీరెల్లి చంద్రశేఖర్ బూత్ అధ్యక్షుడు నిరసనమెట్ల ప్రసాద్, మాజీ సర్పంచ్ పిండి పాపిరెడ్డి, నాయకులు గోశెట్టి భద్రమ్మ, నర్సిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకన్న, వెంకట్‌రెడ్డి, ఈశ్వరయ్య, రామలింగం, అంజిబాబు, నాగరాజు, యాదయ్య, జానకిరాములు పాల్గొన్నారు.
- తిప్పర్తి : బీజేపీ ఇంటి ఇంటి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే బాబు ప్రచారం చేశారు.. బీజేపీ మండల అధ్యక్షుడు వంగూరి రవి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా చేసిన అభివృద్ధిని సూచించే కర పత్రాలను ప్రజలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, వడ్డె శ్రీనివాస్‌రెడ్డి, ధర్నెబోయిన గంగాదర్, భిక్షం, మైనం మల్లయ్య, శివశంకర్,పంపాటి బాలు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ రూరల్ : వెలుగుపల్లిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బూర నర్సయ్య గౌడ్, బీజేపీ నాయకులు

మరమ్మతులు చేసేదెప్పుడో?



అధ్వానంగా తయారైన కాల్వలు

- ఆనవాళ్లు కోల్పోతున్న ఏఎమ్మార్పీ కాల్వలు
- మరమ్మతులకు రూ.442 కోట్లు మంజూరు
- నిధులు మంజూరైనా టెండర్లు పూర్తికాని వైనం
- పనులు చేపట్టాలంటున్న ఆయకట్టు రైతులు

దేవరకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంటనగరాలతో పాటు 516 గ్రామాలకు తాగునీరు అందించే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాల్వలు శిథిలావస్థకు చేరుకోగా ఇరువైపులా కంపచెట్లు పెరిగి ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏఎమ్మార్పీ ప్రాజెక్టుపై దృష్టి సారించారు. కాల్వల మరమ్మతులకు గాను రూ.442కోట్లు నిధులు కేటాయించినా టెండర్లు పూర్తి కాకపోవడంతో మరమ్మతు పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఆయకట్టుకు నీటి విడుదల చేసినా నీరు వృథా అయ్యే పరిస్థితి నెలకొందని ఆయకట్టు రైతులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెండర్లు పిలిచి మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోల్పోతున్నారు.

ఆయకట్టుకు 1800 క్యూసెక్కులు విడుదల

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి వారబందీ పద్ధతిలో ఆయకట్టు రైతులకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏఎమ్మార్పీ నుంచి ప్రధానకాల్వ ద్వారా ఉదయ సముద్రం వరకు జూలై 28 నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. దీంతో పాటు ఆయకట్టు పరిధిలో 90 చెరువులు, 57 డిస్ట్రీబ్యూటరీలు ఉన్నాయి. ఏఎమ్మార్పీ ద్వారా దేవరకొండ, నాగార్జునసాగర్, నల్లగొండ, నకిరేకల్ నియోజకవర్గాలకు ప్రధానకాల్వ ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాటు ఏఎమ్మార్పీ నుంచి ప్రతీరోజు హైదరాబాద్ జంట నగరాలకు తాగునీటి అవసరాలకు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 45 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.

శిథిలావస్థలో కాల్వలు, ఏపుగా పెరిగిన కంపచెట్లు

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నీరు ఏకేబీఆర్ నుంచి ఉదయ సముద్రం వరకు ప్రధానకాల్వ 130 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ప్రధాన కాల్వ ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. డిస్ట్రిబ్యూటరీలు, కాల్వలు శిథిలావస్థకు చేరుకొని ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు 2001లో ప్రారంభించారు. నాలుగు మోటార్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని సాగు, తాగునీటి అవసరాలకు జిల్లాతోపాటు హైదరాబాద్ జంటనగరాలకు నీరు అందించడమే ప్రాజెక్టు లక్ష్యం. కానీ ప్రాజెక్టు ప్రారంభం నుంచి కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడం, కాల్వలు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. శ్రీశైలం సొరంగమార్గం, ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, ఏఎమ్మార్పీ, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తూ అధిక ప్రాధాన్యమిస్తున్నారు. మూడేళ్లలో ప్రాజెక్టులను పూర్తిచేసి నల్లగొండ జిల్లా ప్రజలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. అందులో భాగంగా కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఏఎమ్మార్పీ కాల్వలను మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకుగాను రూ.442 కోట్లు కేటాయించింది. కానీ టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో మరమ్మతు పనులు ప్రారంభం కాలేదు. ఏఎమ్మార్పీ నుంచి ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు వారబందీ పద్ధతిలో ఆయకట్టుకు సాగునీటిని అందిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురవడం, శ్రీశైలం నుంచి నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేయడంతో సాగర్ నిండింది. దీంతో అధికారులు ముందస్తుగానే ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు.

కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి



ఏఎమ్మార్పీ కాల్వలకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు తాగునీటికి నీరు విడుదల చేస్తున్నా వృథాగా పోయే పరిస్థితి ఏర్పడింది. కొన్నేళ్లు గా అధికారులు ప్రాజెక్టును పట్టించుకోవడం లేదు. కంపచెట్లు తొలగించి మరమ్మతులు చేపట్టాలి.

- నామిరెడ్డి రవీందర్‌రెడ్డి, తిరుమలగిరి, పీఏపల్లి

రెండు పంటలకు సాగునీరు అందించాలి



ఏఎమ్మార్పీ ప్రాజెక్టు నుంచి రెండు పంటలకు సాగునీరు అందించాలి. ప్రాజెక్టు కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి. ప్రాజెక్టుపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ప్రభుత్వం నిధులు కేటాయించి కాల్వలకు మరమ్మతులు చేసి కంపచెట్లను తొలగించాలి.

- అంతిరెడ్డి, రైతు, పీఏపల్లి

త్వరలో మరమ్మతు పనులు చేపడుతాం

ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. త్వరలో టెండర్లు పూర్తి చేసి మరమ్మతులు చేపడుతాం. ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తాం. నీటిని వృథా చేయవద్దు.

- సత్యనారాయణ, ఈఈ, ఏఎమ్మార్పీ డివిజన్4



కార్మిక వ్యతిరేక చట్టాలను నిలిపివేయాలి



కొండ్రపోల్‌లో రైతు కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న ఉదయ్‌కుమార్

దామరచర్ల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక చట్టాలను నిలిపివేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండ్రపోల్ గ్రామంలో ఆదివారం మహిళా రైతు కూలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తు కార్మికులు, రైతుల వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వెంటనే కేంద్రప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను మానుకొని వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధనావత్ బుజ్జి, లలిత, మంగ్లీ, జుబ్లీ, రాణి, సుధా, సావిత్రి, నాగమ్మ, రాములమ్మ, మమత పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్ అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న సరస్వతి శిశుమందిర్ సిబ్బంది

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యాలయం అభివృద్ధికి దాతలు సహకరించాలని సరస్వతి శిశుమందిర్ సమితి ప్రధాన కార్యదర్శి యామిని వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణానికి చెందిన ఎన్నారైలు చెరుపల్లి శ్రీనివాస్, చెరుపల్లి అశ్విన్‌లు శిశుమందిర్‌కు కంప్యూటర్లు, క్రీడా సామగ్రి బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న విద్యావిధానాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేందుకు అవసరమైన సాంకేతిక సామగ్రిని అందించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవనపాఠాలు నేర్పించే శిశుమందిర్ అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు భవాని, నాగమణి, రేణుక, స్వాతి, మానస, జయశ్రీ, శ్రావణి, నాగలక్ష్మి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలుచేయాలి : బీజేవైఎం

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్ ప్రభుత్వం అమలు చేయాలని ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బొట్టు సోములు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు బీజేవైఎం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీసీలకు ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాకులు చెప్పకుండా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. తమ పార్టీ రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నా కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెబుతూ పబ్బం గడుపుకోవాలని చూస్తోందని ఆరోపించారు. బీసీలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వనం మదన్‌మోహన్, ధైద రవి, బంటు శ్రీను, కృష్ణంరాజు, రాజశేఖర్, శేఖర్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి



విలేకరులతో మాట్లాడుతున్న పరమేష్

కొండమల్లేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లకు సంబంధించి నాచియప్పన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్న ఏ వర్గానికి లేని క్రిమిలేయర్ నిబంధన బీసీలకే ఎందుకని ప్రశ్నించారు. క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు లింగంపల్లి మధు, కృష్ణ, గిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలి

పెద్దఅడిశర్లపల్లి, చింతపల్లి ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయ పార్టీల్లో ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన సముచిత స్థానం కల్పించాలని ఆర్యవైశ్య సంఘం పలువురు నాయకులు అన్నారు. ఉమ్మడి పీఏపల్లి, గుడిపల్లి, చింతపల్లి మండలాల ఆర్యవైశ్యులు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఆర్యవైశ్యుల రాజకీయ రణభేరికి సభకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకులు ఆర్యవైశ్యులను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకొని పబ్బం గడుపుకున్నారని అన్నారు. పీఏపల్లి నుంచి తరలివెళ్లిన వారిలో ఉమ్మడి మండల ఆర్యవైశ్య కోశాధికారి మిర్యాల సత్యం, గౌరవ అధ్యక్షుడు దొడ్డి లక్ష్మయ్య, వీరమళ్ల పరమేష, జిల్లా ఉపాధ్యాక్షుడు విడియాల బిక్షమయ్య, గట్టు శ్రీను, ఉప్పల కోటి, జగన్, వీరమళ్ల శ్రీను, పానగంటి విశ్వనాథం, శ్రీను, సతీష్‌కుమార్ ఉన్నారు. చింతపల్లి మండలానికి చెందిన సంఘం జిల్లా నాయకులు ముచ్చర్ల యాదగిరి, సముద్రాల నగేష్, కొరివి గిరి, దాచేపల్లి మధు, వంగాల రమేష్, కొరివి రాధాకృష్ణ, కొమిరిశెట్టి వినోద్, తదితరులు తరలివెళ్లారు.

స్నేహితులను వదులుకోకూడదు

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంచి స్నేహితులను ఎప్పుడు వదులుకోకూడదని, అన్ని విషయాల్లో ఎదుటి వారి మనసులను అర్థం చేసుకుని మసలుకునే వారే నిజమైన స్నేహితులని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ ప్రజలు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు ఫ్రెండ్‌షిప్ బాండ్‌లను చేతికి కట్టారు. పార్టీ నేతలు ముఖ్య కార్యకర్తలు బీఎల్ఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితమంతా స్నేహమయమని అన్నారు. మనిషి నాలుగు దశల్లోనూ ఎవరో ఒకరు తోడుంటారని అన్నారు. పసిప్రాయంలో తల్లిదండ్రులే నేస్తాలై ఆడిస్తుంటారని, విద్యార్థి దశ నుంచి వృద్ధాప్యం వరకు స్నేహితులతోనే జీవితం గడిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, చిలుకూరి బాలు, దేశిడి శేఖర్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, వెంకన్న, కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండ: దేవరకొండలో స్పోర్ట్స్ అసోసియేషన్, ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, ఆర్కే ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, పొట్ట విజయ్, గుండాల వెంకటేష్‌లు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కుల, మత బేధాలు లేనిది స్నేహమేనని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు కృష్ణ కిషోర్, ఉమామహేశ్వర్, శ్రీశైలం యాదవ్, శ్రీధర్‌గౌడ్, నిరంజన్, భాస్కర్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ : కేక్ కట్ చేస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ

● చింతపల్లి: మండలంలో స్నేహితుల దినోత్సవాన్ని వయసుకు సంబంధం లేకుండా ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా చింతపల్లి, వేంకటేశ్వర నగర్(మాల్)లో యువత ఫ్రెండ్‌షిప్ బాండ్స్ కట్టుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎక్కడ చూసిన సందడి వాతావరణం నెలకొంది.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభించి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడఅర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వకళాశాలలో ఆదివారం ఓజోన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు పల్లె, పట్టణాల్లో వైద్యశిబిరాలు ఏర్పా టు చేయడం వల్ల ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. అనంతరం ఆస్పత్రికి చెందిన జ నరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, న్యూరో, ఫిజిషియన్, న్యూరోసర్జరీ, కార్డియాలజీ, ఆప్తమాలజీ విభాగాల వైద్యులు శిబిరానికి హాజరైన ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. దీంతో పాటు ఈ సీజీ, 2డీఈకో, బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితం గా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో పలు విభాగాలకు చెందిన ఆస్పత్రి వైద్యులు భరత్‌కుమార్, సురేష్, నిఖిల్, కల్యాణ్, అరుణ, ఇంద్రసేనారెడ్డి, ఆస్పత్రి డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కాంగ్రె స్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ముదిరెడ్డి నర్సిరెడ్డి, రవినాయ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పింఛన్ సౌకర్యం కల్పించాలి

● ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య

మిర్యాలగూడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పింఛన్ సదుపాయం కల్పించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య అన్నారు. ఆదివారం మిర్యాలగూడలో ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడీ టీచర్స్, ఆయాల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడి టీచర్స్‌కు రూ. 5లక్షలు, ఆయాలకు రూ. 2లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్ కల్పించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడిల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐన్‌టీయూసీ వర్కింగ్ జిల్లా ప్రెసిడెంట్ ఎండి. షైనొద్దీన్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పరిక వెంకటేశ్వర్లు, టౌన్ ప్రెసిడెంట్ చాంద్‌పాషా, ఎన్టఈయూసీ రాష్ట్ర నాయకులు జూలకంటి మల్లీశ్వరీ, విజయ, మాధవి, రజియా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి : వెంకట్‌రెడ్డి



ఫౌండేషన్‌కి విరాళం అందిస్తున్న వెంకట్‌రెడ్డి

చింతపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆయన తన జన్మదిన వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మాతృదేవోభవ మానసిక అనాథాశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వృద్ధులకు మనోధైర్యం కల్పించారు. ఫౌండేషన్‌కు వారి సంక్షేమానికి రూ. 21116 విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పూల యాదయ్య, బాదేపల్లి నిరంజన్‌గౌడ్, సీమర్ల శ్రీనుయాదవ్, ధన్‌రాజ్, నందురెడ్డి, లికిత్‌రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

● మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



ఆలయంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావును సత్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 3: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో శ్రీసత్తెమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంటా శ్రవణ్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రవి, ఉపేందర్, నాగరాజు, నాగేష్, రవీందర్‌నాయక్, ఫయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

● స్నేహితుల దినోత్సవం రోజున పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవాన్ని పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా మిత్రుల పోస్టులు వెల్లువెత్తగా పలు కాలనీల్లో దోస్తులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని స్వీట్లు పంచుతూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పతంజలి యోగా క్లబ్ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉత్సవాన్ని ఉద్దేశించి యోగా గురువు లక్ష్మయ్య మాట్లాడుతూ స్నేహానికి మించిన గొప్ప బంధం మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో సభ్యులు చీదళ్ల వెంకటేశ్వర్లు, రాచయ్య, శ్రీనివాస్, లక్ష్మి పాల్గొన్నారు.

● స్నేహితుల దినోత్సవం సందర్భంగా విద్యోదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా నిర్వహించారు. 1999-2000 సంవత్సరంలో అభ్యసించిన విద్యార్థులు కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం పాఠశాల వ్యవస్థాపకుడు పుష్పాల సత్యం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాతిక సంవత్సరాల అనంతరం స్నేహితుల దినోత్సవం రోజు కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పుష్పాల యాదగిరి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, రాజేశ్వరరావు, శోభారాణి, నీరజ, ప్రమీల, గీతాంజలి, అమృత, కమల, అర్చన, శ్రీనివాస్, నర్సింహ పాల్గొన్నారు.

అడుగంటుతున్న.. భూగర్భజలాలు

(5వపేజీ తరువాయి)

బోర్లకు నీరు వచ్చే పరిస్థితి కానరావడం లేదు. వర్షపాతం లెక్కలు సైతం గందరగోళంగా ఉన్నాయి. గ్రామాలవారీగా లెక్కలు లేకపోవడంతో మండలాలు యూనిట్‌గా వర్షాల లెక్కలు వేయడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. చాలా మండలాల్లో అత్యధిక వర్షపాతాలు నమోదైనట్లు లెక్కలు చూపిస్తుండగా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కానరావడం లేదు.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

జిల్లావ్యాప్తంగా మొత్తం 1,828 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో వందలాది చెరువులు నీళ్లు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోయాయి. సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో ఈ సంవత్సరం పరిస్థితి దారుణంగా తయారైంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాలపైనే భూగర్భజలాల పరిస్థితి ఆధారపడి ఉంది. అయితే ప్రస్తుతం వాతావరణం చూస్తుంటే ఎండ తీవ్రత అధికంగా కనిపిస్తుంది. వర్షాలు మాత్రం కురిసే పరిస్థితులు కానరావడంలేదు. జిల్లాలో శనివారం తీవ్ర ఉక్కపోతతో వాతావరణం ఉండగా ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 34.0డిగ్రీలుగా నమోదైంది. వానాకాలంలో ఎండకాలం మాదిరిగా పరిస్థితులు నెలకొన్నాయని చెప్పవచ్చు. చెరువులు, కుంటలను పరిశీలిస్తే 1,180 చెరువుల్లో గతంలో కురిసిన వర్షాల ఆధారంగా 0-25శాతం మేరకు నీరు ఉండగా, 267 చెరువుల్లో 25నుంచి 50శాతం వరకు, 97 చెరువులో 50నుంచి 75 శాతం మేరకు నీరు ఉన్నాయి. ఇక 80 చెరువుల్లో 75నుంచి 100శాతం వరకు నీరు చేరాయి. ఇక కేవలం మూసీ కింద ఉన్న నాలుగు చెరువుల్లోకి మాత్రం 100శాతం నీరు చేరింది. ఏఎమ్మార్పీ కింద ఉన్న 90 చెరువులకు సంబంధించి నీరు విడుదల వల్ల ఇప్పుడిప్పుడే నీరు చేరుతుండటంతో మిగతా చెరువుల్లో వర్షాల్లేక దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.



ఎండిన చెరువులో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)